క్లుప్తంగా

వైద్యాధికారిగా నాగార్జున



రాజవొమ్మంగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ మేడా నాగార్జున శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాగార్జున నర్సరావుపేట ఏరియా ఆస్పత్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ ఉషశ్రీ బదిలీపై వెళుతున్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

డుంబ్రిగుడ: యువతకు క్రీడా రంగంలో ప్రోత్సహించేందుకు డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం కొర్రా పంచాయతీ కేంద్రంలో మహిళ పోలీసు మహేశ్వరి ఆధ్వర్యంలో సర్పంచ్ అర్జున్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాధవి దృష్టికి సమస్యలు



ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

అరకులోయ రూరల్: బొండం పంచాయతీలోని పలు సమస్యలను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దృష్టికి తీసుకెళ్లినట్టు సర్పంచ్ దురియా భాస్కరరావు, నాయకుడు శంకరరావు చెప్పారు. విశాఖపట్నంలో ఎంపీ మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి, పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు డ్రైనేజీలు, రైల్వే అండర్ బ్రిడ్జి తదితర సమస్యలపై వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారని పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివారు ప్రాంతంలో శనివారం సాయంకాలం పందిరిమామిడి ఆర్టీవో రాజేష్‌కుమార్ ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సులు లేని ముగ్గురు వ్యక్తులపై, టాక్స్ బకాయి ఉన్న టాటా ఏస్ వాహనదారుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రతి వాహనదారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. ఎల్ఎల్ఆర్ సులభంగా ఇస్తున్నామని, కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



బుల్లోజిపాలెంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని కోట సచివాలయంలో బుల్లోజిపాలెంలో రూ.40లక్షలతో చేపడుతున్న రహదారి పనులను ఎంపీపీ కడబాల ఆనందరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, సర్పంచ్ చిన్నారావు, నాయకులు భారతిబాబు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం

చింతపల్లిరూరల్: మండలంలోని కొండవంచుల్లో శనివారం జరిగిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో లంబసింగి పశువైద్యాధికారి డాక్టర్ చల్లంగి షాలినీ మాట్లాడుతూ పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవ ద్వారా చెంతకే సేవలు పొందవచ్చన్నారు.రైతులు లంబసింగి, తాజంగిలో రైతులు ఏర్పాటుచేసుకున్న నాటుకోళ్ల ఫారమ్‌లను సందర్శించి, పలు సూచనలిచ్చారు.



స్వగృహానందం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అరకులోయ మండలంలో 392 మంది ఇంటి స్థల పట్టాలు పంపిణీ చేసింది. గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరు చేసింది. త్వరలో ఈ నిర్మాణాలు కార్యరూపం దాల్చనున్నాయి.



ఇంటి పట్టాలతో గిరిజనులు

- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రత్యేక సర్వేలో గుర్తింపు
- నిర్మాణాలకు లేఅవుట్ల సిద్ధం
- సిద్ధంగా ఉన్న గిరిజనులు



లేఅవుట్లను పరిశీలిస్తున్న డీఈఈ రాజుబాబు తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని 290 గ్రామాల్లో సుమారు 39, 600 జనాభా ఉంటున్నారు. వీరిలో జగనన్న లేఅవుట్‌కు అర్హులైన లబ్దిదారులను ప్రభుత్వం ప్రత్యేక సర్వే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ ఇప్పటికే పట్టాలు పంపిణీ చేసింది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని చోట్ల పీఎంఏవై పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్నారు.

- అరకులోయ మండలంలో ఈ ఏడాది జగనన్న గృహ నిర్మాణానికి లే అవుట్‌లు వేసి అర్హులైన గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశారు.
- బస్కీ పంచాయతీలోని గ్రామాల్లో 58 మంది లబ్దిదారులున్నారు. బస్కి పంచాయతీలోని ఒక లేఅవుట్‌లో స్థలాన్ని కేటాయించారు.
- ...బొం...ం...య పంచా...తీలో 28 మందికి పట్టాలు ఇచ్చారు. రెండు లేఅవుట్‌లు నిన్నిమామిడివలస, కొలియగూడలో ఏర్పాటుచేశారు.
- కొత్త భల్లుగుడ పంచాయతీలో 64 మందికి పట్టాలు ఇచ్చారు. సూకూరుగుడ, జనంగుడలో లేఅవుట్‌లు కేటాయించారు.
- పద్మాపురం పంచాయతీలో 70 మందికి పట్టాలు ఇచ్చారు. ఎండపల్లివలసలో లేఅవుట్ కేటాయించారు.
- పెదలబుడు పంచాయతీ పరిధిలో 172 మందికి పట్టాలు పంపిణీ చేశారు. తాంగులగూడలో లేఅవుట్ కేటాయించారు.
- అరకులోయ మండలంలో మొత్తం 14 లేఅవుట్‌లలో 392 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణి చేశారు. గృహాలు మంజూరైలే ఈ లేఅవుట్‌లలో కాలనీలు నిర్మాణాలు ప్రారంభిస్తారని హౌసింగ్ అధికారులు తెలిపారు. ఒక్కో లబ్ధిదారునికి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. మండల వ్యాప్తంగా సుమారు 1176 సెంట్లు కేటాయించారు.

మండలం	: అరకులోయ
పంచాయతీలు	: 14
గ్రామాలు	: 290
జనాభా	: 39,400
భూపట్టాలు పొందిన లబ్ధిదారులు	: 392
మండలంలోని లేఅవుట్లు	: 14

అర్హులందరికీ పట్టాలు



జగనన్న గృహా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లో లేఅవుట్‌లు వేసి, పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తి చేశాం. ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తే కాలనీలు నిర్మిస్తాం.

– రాజుబాబు, డీఈఈ, గృహా నిర్మాణ శాఖ, అరకులోయ

ఆనందంగా ఉంది



సొంత ఇల్లు లేకుండా అద్దె ఇళ్లలో గడిపాం. ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం ఇచ్చారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఇందుకు సహకరించిన యంత్రాంగానికి ధన్యవాదాలు. సొంతింటి కల సాకారం అవుతుండడంతో చాలా ఆనందంగా ఉంది.

– పాంగి గాయత్రి, అరకులోయ మండలం

నేడు భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం

సాక్షి, పాడేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పాడేరులో ఘనంగా నిర్వహించనున్నట్టు పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడేరు పాతబస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం 10గంటలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తారని, అనంతరం అంబేద్కర్ విగ్రహం ఆవరణలోనే సమావేశం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం గొప్పతనంతో పాటు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో బడుగుల బలహీన వర్గాల అభ్యున్నతికి ఏపీలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు,రాష్ట్ర అభివృద్ధికి సంభందించిన అంశాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ట్రైకార్ చైర్మన్‌తో పాటు పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, ఎంపీపీ, జడ్పీటీసీ, జిల్లా, మండల పార్టీ నేతలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న పెద్దలు,సర్పంచ్‌లు,ఎంపీటీసీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

అడ్డతీగల: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం అడ్డతీగలలో ఘనంగా నిర్వహించనున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.తొలిత అడ్డతీగలలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించి మీడియా సమావేశంలో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.

అంగన్‌వాడీ భవనాల పనులపై అవగాహన

మారేడుమిల్లి: నాడు–నేడు పనుల్లో భాగంగా మంజూరైన అంగన్‌వాడీ భవనాల మరమ్మతు పనులపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.ప్రసన్న విశ్వనాథ్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మారేడుమిల్లి ఐసీడీఎస్ పరిధిలో 90 కేంద్రాలున్నాయని, వీటిలో 56 కేంద్రాల భవనాల మరమ్మతుల నిమిత్తం నాడు–నేడు–2బీ లో గుర్తింపు పొందాయన్నారు. భవనాల మరమ్మతుల పనుల నిమిత్తం, ఒక కమిటీ నియామకం జరగ అందులో అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్, పాఠశాల హెచ్ఎం, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రామంలో రెండు నుంచి నాలుగు నెలల పిల్లల తల్లులు ఏడుగురు కమిటీ మెంబర్లుగా ఉంటారని తెలిపారు. వీరి పరివేక్షణలో పనులు జరుగుతాయన్నారు. ఈ మరమ్మతుల పనులు ఏవిధంగా చెపట్టాలి తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ఎంఈవో తమ్మరావు, ఏవో జయంతి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో తల్లుల కమిటీలతో సీడీపీవో లక్ష్మీదేవి శనివారం సమావేశం నిర్వహించారు. నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులపై అవగాహన కల్పించారు. గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి జేఈ వినయ్, అంగన్‌వాడీలు వలసమ్మ, మోహిని, రామలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోగికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు

చింతపల్లిరూరల్: బ్రెయిన్ టూమర్‌తో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక ఏరియా ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుకి చేయూత వారియర్ ట్రస్ట్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. సాడిపేటకు చెందిన సుంకరి శివ గత నాలుగేళ్లుగా స్థానిక ఏరియా ఆస్పత్రిలె సెక్యూరిటి గార్డుగా పని చేస్తున్నాడు .అయితే అతను గత కొన్నిరోజులుగా బ్రెయిన్ టూమర్‌తో బాధపడుతు తిరుపతిలో ఉన్న విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాన్ని ఆదుకోవడానికి చేయూత వారియర్స్ తరపున ముందుకు వచ్చి వ్యక్తిగతంగా నిధులు సేకరించి ఆయనకు రూ.10వేలు అందజేశామని ట్రస్ట్ అధ్యక్షుడు రమణ తెలిపారు. లోవరాజు, దివాసం, సాయి, స్వామి పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మారేడుమిల్లి : మండలంలోని తాడేపల్లి పంచాయతీ పరిధిలోని మద్దివీడు గ్రామంలో శివాలయం నూతన ఆలయ నిర్మాణ పున:ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యే పూజలు, అభిషేకాలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చినట్టు ధర్మ ప్రచార సేవా భక్త మండలి కో–ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి చెప్పారు.

వైభవంగా శోభాయాత్ర

రాజవొమ్మంగి: మండలం కేంద్రంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైందవ ధర్మ పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తర కాశీకి చెందిన సూర్య భాస్కరేంద్రసరస్వతి స్వామిజీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి , సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డివిజన్ ధర్మ ప్రచారక్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



జీడిగుప్ప సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు



ఇందుకూరుపేటలో పర్యటిస్తున్న నాయకులు

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సిరసం సత్యవేణి తదితరులు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. సచివాలయ కన్వీనర్ బాబ్జి, సత్యనారాయణ, వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, పెద్దబ్బు, చిన్ని, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వీఆర్ పురం: జీడిగుప్ప సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మూట్ల బాలరాజు తదితరులు ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు , మాజీ కన్వీనర్ గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, ఎంపీటీసీ విజయలక్ష్మి ,జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిషన్ సభ్యులు బాలు, నాయకులు వెంగళరావు, కాంతారావు, ఉమ, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో శనివారం ఘనంగా రాజ్యంగ ఆమోద దినోత్సవాన్ని ముందస్తుగా శనివారం నిర్వహించారు., నవంబర్ 26 వ తేది రాజ్యంగ దినోత్సవం పురస్కరించుకొని కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు పి.నాగబాబు మాట్లాడుతూ ప్రపంచ రాజ్యంగాల్లో అతిపెద్ద రాజ్యంగం భారత రాజ్యంగన్నారు. వైస్ ప్రిన్స్‌పాళ్లు డాక్టర్ కె.పుష్పరాజ్, పట్టాసి చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: భారత రాజ్యాంగం గొప్పదని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె హరూన్ అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు.రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరికి అనువైన రాజ్యాంగాన్ని రాశారని ఆయన వివరించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వసి నివాళి అర్పించారు. అధ్యాపకులు మహాలక్ష్మి , మంగమ్మ, రాజుబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొయ్యూరు: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందబాటులో ఉండాలని ఎంపీడీవో లాలం సీతయ్య స్పష్టం చేశారు. ఆయన తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగి ఫేషియల్ రికగ్నేషన్ వేయాలని, స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యం



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి తదితరులు



ధాన్యంపాలెంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల వివరాలున్న బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అనంతగిరి: ప్రజా సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొండిబ పంచాయతీ కేంద్రంలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.24లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని (ఆర్‌బీకే) ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఒకప్పుడు ఏ రకమైన ప్రభుత్వ సేవలు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సివచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చిన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయన్నారు. దీంతోపాటు రైతులకు ఆర్‌బీకేల ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటల సాగు సూచనలు, సలహాలు అందుతున్నాయన్నారు. కొండిబ పంచాయతీ మువ్వవలస, లింబగుడ, కరకవలస, దముకు, తోకవలస, గరిగూడ, సీసాముండ, షాడ, తైడ, కొందగూడ గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 540 గడపలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించి, గిరిజనులతో మమేకమైయ్యారు. గడప గడప కార్యక్రమానికి ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, సర్పంచ్ పున్నమ్మ, ఉపాధ్యక్షుడు సూర్యానారాయణ, మధుసూదన్, మండల ప్రధాన కార్యదర్శులు శెట్టి లక్ష్మణరావు, గంగులు, దానియేలు, ఎంపీటీసీ సభ్యుడు అశోక్, జేసీఎస్ కన్వీనర్ నవీన్, నాయకులు సుబ్బారావు, కొండప్ప, భీమల, పరశురామ్, కృష్ణమూర్తి, గంగరాజు, రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీహర్షిత్, డీఈ రామరాం, ఏఈలు సాయి, గణేష్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమమే

అడ్డతీగల: రాష్ట్రంలో జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమమే నెలకొందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు.అడ్డతీగల మండలం ధాన్యంపాలెం,శెట్టిపల్లి, చిన్నమునకనగడ్డ గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు 160 గడపలను సందర్శించారు.ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ సీఎం జగనన్న సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన సాగుతోందన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులకు నాంది పలికి ప్రజావసరాలకు తగినట్లు నిధులు కేటాయించి సౌకర్యాలు మెరుగుపర్చడమే కాకుండా ఉపాధ్యాయ, వైద్య నియామకాలు జరిపారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు.రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసి సభ్యులు వీర్రాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గ్రామ శివారులో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

గూడెంకొత్తవీధి: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని గూడెంకొత్తవీధి డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఓటరు లిస్టులో పేర్ల తొలగింపు, నూతన ఓటర్లను చేర్చే అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆర్ఐ మహదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

పాడేరు రూరల్ : పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అభివృద్ధి నిధులతో మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు చెప్పారు. మండలంలోని చింతలవీధిలో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ వంతాల సీతమ్మ, ఎంపీటీసీ సభ్యులు గిడ్డి విజయలక్ష్మి, కుంతూరు నర్సింహమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, నేతలు చిట్టిబాబు, సర్పంచ్‌లు రాంబాబు, నీలకంఠం, లక్ష్మణరావు, కన్వీనర్లు కన్నాపాత్రుడు, నరేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మారేడుమిల్లి : స్థానిక సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సంక్షేమ పథకాలను ఎంపీడీవో వీరా కిషోర్ ప్రజలకు వివరించారు. ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీ బాబు, సర్పంచ్ జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

చింతూరు: చల్లతోగులో పోడుభూములు సాగుచేస్తున్న గిరిజనుల ఇళ్లు అటవీ సిబ్బంది దగ్ధం చేశారని బీజేపీ నాయకులు ఆరోపించి ఆందోళన చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంకయ్య, రమణారెడ్డి, రామారావు, వెంకటరమణ, చంద్రయ్య, దుర్గ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు సన్మానం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పాడేరు నియోజకవర్గంలోని కొంతమంది పార్టీ నేతలతో శనివారం సూకురుపుట్టు గ్రామంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్తీక మాసంతో భోజన కార్యక్రమం నిర్వహించి,వారందరికి సతక బుల్లిబాబు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

హుకుంపేట: సంతారిలో శనివారం జరిగిన కార్యక్రమంలో గిరిజాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి, ఉద్యోగ, ఉన్నత విద్య తదితర అంశాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింహాచలం మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

ఫుట్‌బాల్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థిని



చెదల విజయ

అడ్డతీగల: మండలం వేటమామిడిలోని ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని చెదల విజయ ఫుట్‌బాల్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున అండర్–14 స్థాయిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకూ విశాఖపట్నం జిల్లా భీమిలిలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ ధన సందీప్, పీఈటీ సుందరం చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని విజయను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.